ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 14 జూలై 2025

కాళరాత్రి

- కూలికెళ్లి కాటికి...
- మామిడి కాయల లారీ బోల్తా
- 9 మంది దుర్మరణం
- 9 మందికి గాయాలు
- మృతులంతా ఒకే ఊరికి చెందిన కూలీలు



ప్రమాదంలో మృతి చెందినవారు



బోల్తా పడిన లారీ

పుల్లంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆ రాత్రి వారికి కాళరాత్రిగా మారింది. కూలీకోసం వెళ్లిన వారు కాటికెళ్లారు. పుల్లంపేట మండలం కడప-చెన్నై రహదారిలో రెడ్డిపల్లె చెరువుకట్టపై మామిడి కాయల లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడటంతో ఎనిమిది మంది అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మరో 9 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన కూలీలు రాజంపేట మండలం ఇసుక పల్లెకు వెళ్లి తోటలోని మామిడికాయలు కోసి లారీకి లోడు చేసుకుని ఆదివారం రాత్రి రైల్వేకోడూరు మార్కెట్‌యార్డుకు లారీలో మొత్తం 22 మంది బయలుదేరారు. అందులో 19 మంది కూలీలు కాగా ఇద్దరు చిన్నారులు, డ్రైవర్ ఉన్నారు. మార్గమధ్యంలో పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద రాత్రి 10.30 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి కట్టపై నుంచి లారీ బోల్తా పడింది. లారీలో ఉన్న 22 మందిలో చెల్లాచెదురు కాగా కొంతమంది మామిడి కాయల కింద ఇరుక్కుపోయారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి, ఇద్దరు చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే ఆధ్వర్యంలో రెండు క్రేన్లు, ఎక్స్‌కవేటర్లు తెప్పించి సహాయక చర్యలు చేపట్టారు. ముందుగా గాయపడిన 10 మందిని 108 వాహనాల్లో రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అందులో ఒకరు ఆస్పత్రిలో చనిపోయారు. మిగిలిన వారి కోసం లారీని పక్కకు తప్పించగా ఎనిమిది మంది కూలీలు మామిడి కాయలలో ఇరుక్కుని మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

చిట్టెమ్మా.. లెయ్యవే..

లారీ ప్రమాదంలో తన భార్య చిట్టెమ్మ మృతి చెందడంతో సురక్షితంగా బయటపడ్డ భర్త భార్య మృతదేహం వద్ద బోరున రోదించడం అందరినీ కలచివేసింది. 'చిట్టెమ్మా.. లెయ్యవే' ఇంతకు ముందే కదా మనం మాట్లాడుకున్నాం.. ఇంటికి పదాం లెయ్యవే' అని విలపించడం అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది.



భార్య మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త



లారీని క్రేన్ ద్వారా బయటకు తీస్తున్న దృశ్యం



మృతదేహాలను వెలికితీస్తున్న పోలీసులు, స్థానికులు





ప్రమాదం నుంచి బయటపడిన చిన్నారులు

పెద్దజంగంపల్లిలో కప్ప దేవర చేస్తున్న దృశ్యం



వర్షాలు కురవాలని కప్ప దేవర

- అనాదిగా వస్తున్న ఆచారం

సంబేపల్లె/చిన్నమండెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కప్పదేవర... ఇది పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారం. ప్రకృతి సహకరించకపోవడం.. వర్షాలు పడకపోవడం వంటి పరిస్థితులు వస్తే చాలు. కప్ప దేవర చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. సంబేపల్లె మండలం దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లిలో ఆదివారం కప్ప దేవర చేశారు. సంప్రదాయబద్ధంగా గతంలో సజ్జలు, రాగులు, వరి విత్తనాలను దంచేందుకు రోకలి బడేలను వినియోగించేవారు. రోకలి బడేకు వ్యవసాయ బావుల్లో ఉండే కప్పలను తెచ్చి బడేపై వేపాకు కట్టి కప్పలను వాటిపై పెట్టి పసుపు, కుంకుమతో పూజ చేసి అగరబత్తిలు వెలిగించి 15 ఏళ్లలోపు పిల్లలు పురవీధుల్లో తిప్పుడూ ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమతో పాటు ఒక బిందెడు నీరు బోసి పిల్లలు పెద్దలు అందరూ సందడిగా నోరు బాదుకుంటూ వర్షాలు కురవాలి వానదేవుడా అంటూ పూజలు చేయడం కప్పదేవర విశేషం.

చిన్నమండెం మండలం దేవగుడిపల్లె గ్రామం కురవపల్లెలో ఆదివారం గ్రామస్థులు భైరాగునికి, సఫలమ్మకు బోనాలు పట్టారు. సకాలంలో వానలు కురవని ప్రతి ఏడాది... సఫలమ్మకు, భైరాగునికి పెళ్లి కాని యువకులు బోనాలు సమర్పిస్తారు. శనివారం రాత్రి చన్నీటి స్నానం చేసిన యువకులు తొలుత గ్రామ ఇలవేల్పు పెద్దయ్య స్వామికి పూజలు చేసిన అనంతరం సంప్రదాయ పద్ధతుల్లో డప్పు, మంగళ వాయిద్యాల నడుమ పానకాలు చేసి అందరికీ పంచిపెట్టారు. ఆదివారం ఉదయం ఊరిలోని ప్రతి ఇంటి వద్ద నుంచి బియ్యం, కందిబేడలు, బెల్లం సేకరించి.. బోనాలు చేసి.. సంప్రదాయ వాయిద్యాల నడుమ.. పెళ్ళికాని యువకులు బోనాలు ఎత్తుకుని కాలినడకన వెళ్ళి సఫలమ్మకు, భైరాగుట్టకు వెళ్లి భైరాగునికి బోనాలు సమర్పించారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరు గాంచిన రెడ్డెమ్మకొండ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు చెల్లించడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అనుగుణంగా సౌకర్యాలను ఆలయ సిబ్బంది కల్పించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి వరపడుతున్న మహిళలు

మున్సిపల్ సిబ్బంది సమ్మెబాట



మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న వాటర్, ఇంజనీరింగ్ సెక్షన్, ఎలక్ట్రిసిటీ వర్కర్స్ శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెబాట పట్టారు. రాయచోటి పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ఆవరణంలో జరుగుతున్న శిబిరంలో మొదటిరోజు సమ్మె దీక్షలో కూర్చున్న వారికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు పూలమాల వేసి దీక్షలు ప్రారంభించారు. ఆదివారం మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణతో కలిసి ఆటో ప్రచారాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజులుగా అనేక రూపాల్లో ఇంజనీరింగ్ (వాటర్, విద్యుత్‌సెక్షన్స్) సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలని, జీవో 36 ప్రకారం జీతాలు పెంచాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పనిముట్లు ఇవ్వాలని, రక్షణ పరికరాలు అందించాలని అనేకమార్లు కింది స్థాయి అధికారి నుంచి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వరకు విన్నవించినా పరిష్కారం కానందున తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు పంప్ హౌస్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురికి 14 నెలల జీతం ఇవ్వాలని, కోర్టు ఆదేశాలను సైతం పెడ చెవిన పెట్టి వర్కర్లను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది అక్బర్, శంకరయ్య, ఈశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, రమణ, రమేశ్, రమాదేవి, వెంకటలక్ష్మి, మౌనిక, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వైట్‌హౌస్ సందర్శన

- సమన్వయకర్తగా తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీశ్



అమెరికాలోని వైట్‌హౌస్ వద్ద ఉపసభాపతి రఘురామకృష్ణమరాజు, ఎంపీ సుధాకర్, వేమన సతీశ్ తదితరులు

రాజంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడి వైట్‌హౌస్‌ను, పార్లమెంట్‌ను రాష్ట్ర ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, పార్లమెంట్ సభ్యుడు కె.సుధాకర్, కాకినాడ పోర్టు చైర్మన్ కేవీ రావు, రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు సందర్శించారు. కార్యక్రమానికి అమెరికాలోని తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత వేమన సతీశ్ సమన్వయకర్తగా వ్యవహరించి వారికి చూపించారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్ వివరాలను, పార్లమెంట్ వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ అగ్రరాజ్యమైన అమెరికాతో సత్సంబంధాలు కలిగి ఉన్నాయని, దీనివల్ల అనేక ప్రయోజనాలు జరుగుతున్నట్లు వారు తెలిపారు. సాంకేతిక, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాలు ఎంతో ముందుకు సాగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా తాము వైట్‌హౌస్‌ను, పార్లమెంట్‌ను సందర్శించడం ఆనందంగా ఉందని వేమన సతీష్ తెలిపారు.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు


- సంతాపం తెలిపిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినిమా రంగానికి తీరని లోటని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం కోట శ్రీనివాసరావు తెలుగు సినిమా రంగానికి అందించిన ఎనలేని సేవలను కొనియాడుతూ ఆయన మృతికి మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. విలక్షణమైన పాత్రలు, సహజ నటనతో సినీ ప్రియుల మదిలో చిరస్థాయిగా నిలిచారన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో కోట శ్రీనివాసరావు లేని లోటు భర్తీ చేయలేనిదని మంత్రి సానుభూతి తెలిపారు.

వైభవం.. యల్లమ్మ రథోత్సవం



సౌమ్యనాథునికి చక్రస్నానం





కోనేటిలో చక్రస్నానం ఆచరిస్తున్న దృశ్యం

నందలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత స్వామివార్లకు ఆదివారం అత్యంత వైభవంగా చక్రస్నానం జరిగింది. టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో ముగింపు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా ఉదయం సౌమ్యనాథునికి గ్రామోత్సవం, వసంతోత్సవం జరిగింది. ఆలయంలో ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళ గంధం, పాలు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలాలతో అభిషేకం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయి స్వామిలు ఉత్సవ మూర్తులకు కోనేటిలో చక్ర స్నానం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమాన్ని పాంచరాత్ర ఆగమ పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి సౌమ్యనాథస్వామికి పుష్ప యాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అన్నమయ్య ప్రాజెక్టు పరిశీలన

- త్వరలో ప్రభుత్వానికి నివేదిక : అధికారులు
- ప్రాజెక్టు పునర్నిర్మాణానికి త్వరలో చర్యలు : జగన్‌మోహన్‌రాజు



అన్నమయ్య ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర జల వనరుల శాఖాధికారులు ఆదివారం పరిశీలించారు. ప్రాజెక్టు పునర్నిర్మాణంపై తీసుకోవాల్సిన చర్యలు, సాంకేతిక లోపాల దిద్దుబాటు, ప్రాజెక్టు పునర్నిర్మాణంపై సాధ్యాసాధ్యాలు తదితర అన్ని అంశాలపై నిపుణుల కమిటీ పూర్తి స్థాయి అంశాలపై దృష్టి సారించింది. ఈ మేరకు ప్రాజెక్టుల డిజైన్ ఎక్స్‌పర్ట్ పోలవరం ప్రాజెక్టు ప్రధాన చీఫ్ ఇంజనీర్ రమేష్‌కుమార్, హైడ్రోమెకానికల్ ఎక్స్‌పర్ట్ విశ్రాంత సీఈ కె.సత్యనారాయణ, జియాలజిస్ట్ విభాగానికి చెందిన విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఎం.రాజు, అన్నమయ్య ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ రామచంద్రమూర్తి తదితరులు ప్రాజెక్టు తెగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, అన్నమయ్య ప్రాజెక్టు బాధిత ప్రజలు, రైతులు ముంపు ప్రాంతానికి చెందిన టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొండా శ్రీనివాసులు, టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలతో మాట్లాడి అన్ని వివరాలు సేకరించారు. రైతులకు పూర్తి స్థాయి న్యాయం జరిగేటట్లు ప్రాజెక్టును ఎలా నిర్మించాలి, గతంలో జరిగిన పొరపాట్లు లేకుండా ఏ చర్యలు తీసుకోవాలనే అంశాలపై మాట్లాడారు. నిపుణుల కమిటీ సభ్యులందరం కూర్చుని అన్ని విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదికను అందజేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని వారు తెలిపారు. ఈ సందర్భంగా చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ జలవనరులశాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేస్తున్నారని, ప్రాజెక్టు రిపోర్టు పూర్తయిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని, తదనంతరం ప్రాజెక్టును త్వరితగతిన పునఃప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటారని తెలిపారు.

కంకర..కరకరా..!

● కరిగిన మోరీలు ● కమ్మి తేలిన రోడ్లు ● ప్రయాణం నరకం ● అధ్వానంగా బోడిమలదిన్నె రహదారి



బోడిమలదిన్నె గ్రామంలో కంకర తేలి పైకిలేచిన కమ్మీలు

మదనపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కంకర తేలి.. కమ్మి కనిపిస్తూ.. కరిగిపోయిన మోరీలు.. మదనపల్లె నుంచి బోడిమలదిన్నె మీదుగా నిమ్మనపల్లె మండలానికి వెళ్లే లింకు రోడ్డు దుస్థితి ఇది. రోడ్లు, భవనాల శాఖకు చెందిన ఈ రోడ్డును 2013లో మట్టి నుంచి తారురోడ్డుగా మార్పు చేసింది. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి వికలాంగుల కాలనీ, ఇసుకనూతిపల్లె, కొండామరిపల్లె, బెస్తపల్లె, బోడిమలదిన్నె మీదుగా నిమ్మనపల్లె మండలం గారబురుజుకు వెళ్లే గ్రామీణ రోడ్డు ఇది. 6 కి.మీ. దూరం గల ఈ మార్గంలో అయిదు బ్రిడ్జిలు, కొండామరిపల్లె సమీపంలోని మంగళపల్లె చెరువుకు రైలింగ్ గోడ నిర్మించారు. మొత్తం తారు రోడ్డు అయినప్పటికీ కొండామరిపల్లె, బెస్తపల్లె, బోడిమలదిన్నె గ్రామాల్లో సిమెంటు రోడ్డు వేశారు. పైప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు ప్రవహించే, చెరువు మొరవలు ఉండే ప్రాంతాల్లో సిమెంటు కాంక్రీటు నిర్మాణంతో రోడ్డు వేశారు. తర్వాత అయిదు కి.మి.మేర తారురోడ్డు వేశారు. అంతవరకు బాగానే ఉన్నా..ఈ రోడ్లు వేసిన రెండేళ్లకే కంకర తేలిపోయి, గ్రామంలో సిమెంటు కాంక్రీటులో వేసిన కమ్మీలు బయట కనపడుతున్నాయి. అలాగే రోడ్డు వెంట నిర్మించిన బ్రిడ్జి (మోరీ)లకు అటు, ఇటు నిర్మించిన రైలింగ్ గోడలు కూడా కరిగిపోయాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రెండేళ్లకే ఈ దారుణ పరిస్థితికి వచ్చాయి.

అయితే తారురోడ్డు కూడా అక్కడక్కడా కంకర తేలి గుంతలు పడగా, తర్వాత గతుకులకు అతుకులు వేశారు. కానీ సిమెంట్ రోడ్డును మాత్రం అలాగే వదిలేశారు. పది గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. కంకర లేచిన రోడ్డులో ప్రయాణం అంటేనే భయపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కంకర రాళ్లతో నిత్యం వాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాహనాల ప్రయాణం పక్కన పెడితే, నిత్యం ఇళ్ల నుంచి బయటకు వచ్చి తిరగడమే గగనంగా మారింది. ఈ రోడ్లను బాగు చేయాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నా..ప్రయోజనం లేదు. గ్రామాలకు వచ్చిన పాలకులు, అధికారులను నిత్యం నిలదీస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదీ జరిగినా.. అక్కడికి వచ్చే రాజకీయ నాయకులు, పాలకులకు కంకర తేలిన రోడ్ల సెగే వారిని భయపెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..స్థానికుల్లో కాస్త ధైర్యం వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రోడ్లకు డిప్యూటీ సీఎం, పంచాయతీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ పెద్దపీట వేస్తుండటంతో మదనపల్లె-బోడిమలదిన్నె రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బెస్తపల్లెక్రాస్‌లో సిమెంటు రోడ్డు దుస్థితి



కొండామరిపల్లెలో కంకర తేలిన రోడ్డు



కొండామరిపల్లె సమీపంలో కరిగిపోయిన బ్రిడ్జి రైలింగ్ గోడ

ఉత్సవ విగ్రహాలుగా ఉన్నత విద్యాలయాలు

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి



మాట్లాడుతున్న తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిధులు, సిబ్బంది కొరత కారణంగా రాష్ట్రంలో ఉన్నత విద్య నిర్వీర్యమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాలు ఉండగా 9 విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లు లేరన్నారు. 474 ప్రొఫెసర్ పోస్టులు, 859 అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులు, 2,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు క్షీణించాయన్నారు. రూ. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు, మెస్ చార్జీల బకాయిలు పేరుకు పోయాయన్నారు. కళాశాల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాయన్నారు. 2020 డిసెంబరు 25న వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 77 కారణంగా ప్రైవేట్, ఎయిడెడ్ పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు వర్తించక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్నారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమే కాలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్త తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు మూడు ఎకరాలు విరాళం



భూమికి సంబంధించిన పత్రాలను ట్రస్ట్ సభ్యులకు అందిస్తున్న దాతలు

తంబళ్లపల్లె జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లయ్యకొండ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సేవా సమితి అన్నదాన ట్రస్టుకు తంబళ్లపల్లె మండల కేంద్రం సాలెవీధి వాసి గనుముక్కల శ్రీనివాసులు తమ తల్లిదండ్రులు మునెమ్మ, సుబ్బరాయుడు జ్ఞాపకార్థం అన్నదాన కేంద్రానికి సమీపంలోని మూడెకరాల భూమిని ట్రస్ట్ అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ఆదివారం శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి భూమి పత్రాలను ట్రస్ట్ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీం, అన్నదాన ట్రస్ట్ సభ్యులు నారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ్మూర్తి, జయనారాయణరెడ్డి, రఘు,తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ఓబులేసు మృతదేహం

పెండ్లిమర్రి, జులై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చక్రాయపేట మండలం నడింపల్లెకు చెందిన ఇండ్లోల ఓబులేసు (23) నందిమండలం గ్రామస్తుడు జా కీర్‌కు చెందిన పొలానికి కాపలాదారుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి నీలం వెంకట శివ అనే వ్యక్తి తన పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అయితే, అతని మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పోలీసులు తెలిపారు.

వన మూలిక తిని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విషపూరితమైన వన మూలిక, బెల్లం తిని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీటీఎం, పడమటి వీధికి చెందిన రాజయ్య(62) కూలి పనులు చేస్తూ జీవించేవాడు. రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతుం డడంతో శనివారం రాత్రి భార్య రాజమ్మ ఆయనను మందలించిం ది. దీంతో ఆదివారం ఉదయం ఎవరూ లేని సమయంలో వన మూలిక బెల్లం కలుపుకుని తిని ఇంట్లో స్పృహతప్పి పడిపోయాడు. మధ్యాహ్నం కూలి పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన భార్య విషయం గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా



బోల్తాపడిన సిమెంటు ట్యాంకరు


వల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కడప - తాడిపత్రి మండల పరిధిలోని ఎ.ఓబాయపల్లె సమీ పంలో ఆదివారం సాయంత్రం లారీ బోలా పడిందని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఆయన అందించిన సమా చారం మేరకు ఎర్రగుంట్ల నుంచి సిమెంటు లోడుతో వెళుతున్న ట్యాంకరు డ్రైవరు మద్యం మత్తులో వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. కాకపోతే రోడ్డు మధ్యలో పడడం వల్ల కొంత మేర ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి క్రేన్ సాయంతో ట్యాంకరును తొలగించి యధావిధిగా ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పులివెందుల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న ఓ మహిళ ఆదివారం మృతి చెందింది. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన సరితాల రహమత్ (24) జూలై 7 న కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. భర్త అల్లాబాష కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి కర్నూలుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు.

గంటలోపే తప్పిపోయిన పిల్లల ఆచూకీ గుర్తింపు

● తల్లిదండ్రులకు అప్పగించిన చిన్నచౌకు పోలీసులు



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న చిన్నచౌకు సీఐ, ఎస్ఐలు

కడప క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన ఇద్దరు చిన్నారులను గంట సమయంలోపే గుర్తించిన చిన్నచౌకు పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్ కుటుంబం జీవనోపాధి నిమిత్తం ఇటీవల కడప నగరానికి వలస వచ్చి అశోక్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారు తమ పిల్లలు అశోక్(8), శారద (12)ను స్థానిక పాఠశాలలో చేర్పించేందుకు తమ గ్రామం నుంచి కడపకు తీసుకువచ్చారు. అయితే, అది ఇష్టం లేని చిన్నారులు తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో కనిపించకుండాపోయారు. చుటుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఓబులేసు ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. కేవలం ఒక గంటలోపే ఇద్దరు పిల్లల ఆచూకీ కనుగొని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసుల కృషిని స్థానికులు కొనియాడారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

● ఘనంగా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ రమేష్‌నాథరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జిల్లాల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు అనంతబొట్ల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రమేష్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో కడప అన్నమయ్య క్లబ్‌కు ఉమ్మడి జిల్లాలోనే మంచి గుర్తింపు వచ్చిందన్నారు. పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సేవా భావం అలవర్చాలన్నారు. కీలక సందేశం ఇచ్చిన పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జె.రామచంద్ర ప్రకాష్‌రావు మాట్లాడుతూ 50 ఏళ్లుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ కె.చిన్నపరెడ్డి దశ నిర్దేశం చేస్తూ సభ్యులందరికి సహకారంతో సమాజ సేవలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ అవసరార్థులను ఆదుకోవడమే కాక, డ్రగ్స్ తదితర సామాజిక రుగ్మతల నుంచి యువతను విముక్తి చేయడం, పర్యావరణ పరిరక్షణలాంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆదూర శివశంకర్‌రెడ్డి, ఎస్ఎండీ బాషా, టీఎస్ గౌరీశంకర్, కార్యదర్శిగా గునిశెట్టి సాయికుమార్, జాయింట్ సెక్రటరీగా రాఘవేంద్ర వర్మ, కోశాధికారిగా సుబఖ్ తాహిన్, సహ కోశాధికారిగా కొండూరు జనార్దన్ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసులు, బోగాల కొండారెడ్డి, వి.గౌరీశంకర్, దేవతి రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మ రథోత్సవం



రథంపై ఊరేగుతున్న యల్లమ్మ అమ్మవారు

కలికిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యల్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాల తో సుందరంగా అలంకరించిన రథంపై అమ్మవారిని కొలువు దీర్చారు. గృహస్తులు రథాన్ని స్వాగతించారు. అడుగడుగునా భక్తులు సాగిల పడ్డారు. అమ్మవారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు.

పంచాయతీ కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, వెంకట రెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు రథోత్సవాన్ని పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించేందుకు మహిళలు బారులు తీరారు. గ్రామాల నుంచి గుంపులు గుంపులుగా బ్యాండు వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చిన మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి చాందినీ బండ్లు ప్రదక్షిణలు చేశాయి.

ఏసీఏ అండర్-16 క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు ఆధిక్యం



ఎం.డి.ఎస్. అక్తర్ (202 పరుగులు)



తేజేశ్ (5 వికెట్లు)



దైవిక్ (58 పరుగులు)

కడప స్పోర్ట్స్, జులై 13 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ పోటీల్లో భాగంగా రెండు వే ర్వేరు జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లలో చిత్తూరు జట్టు 160 పరుగుల ఆధిక్యం సాధించగా, మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 96 పరుగుల వెనుకంజలో నిలిచింది. వివరాలిలా...

కేఓఆర్ఎం మైదానంలో

నగర శివారులోని కేఓఆర్ఎం మైదానంలో చిత్తూరు- కడప జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 38.4 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్ అయింది. కాగా చిత్తూరు జట్టు బౌలర్ తేజేశ్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. ఇందులో ఎండీఎస్. అక్తర్ ఏకంగా 202 పరుగులు చేయడం విశేషం. దీంతో చిత్తూరు జట్టు ఇప్పటికే 160 పరుగుల ఆధిక్యం సాధించింది.

ఏసీఏ మైదానంలో

వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానంలో టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు 74 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌట్ అయింది. దైవిక్ 58 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరు గులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 96 పరుగుల వెనుకంజలో ఉంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు , జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి విషయంలో ఏర్పడిన వివాదంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. రామేశ్వరం మిట్టమడి 9వ వీధిలో ఉండే రెండు సెంట్ల ఇంటి విషయంపై ఎద్దుల ప్రమీలా దేవికి అమరావతి వేణుగోపాల్ మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో 11వ తేదీ మధ్యాహ్నం ప్రమీలా దేవితో ఇల్లు ఖాళీ చేయించేందుకు వేణుగోపాల్ సింహాద్రి పురానికి చెందిన జాకీర్, ఇదయతుల్లాను పురమాయించాడు. వారు ఆమె ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేయడంతోపాటు, సామాను చెల్లాచెదురు చేసి బెదిరించారని బాధితు రాలి భర్త మల్లికార్జున తెలిపాడు. 12 తేదీన మున్సిపల్ పార్కు వద్ద ఉన్న మల్లికార్జునను వెంబడించే ప్రయత్నం చేశారని అతను భార్య ప్రమీలా దేవికి ఫోన్‌లో తెలపడంతో ఆమె ఆందోళనకు గురై ఆత్మ హత్యాయత్నం చేసింది. ఈ విషయంపై వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): భర్తను హత్య చేసిన కేసులో భార్య వనిత, ప్రియుడు రెడ్డిరామ్‌ను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, బసినికొండ నక్కలకుంటలో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్న గంగాధర్‌ను జూన్ 15 రాత్రి ఆదివారం ఇంట్లోనే నరికి చంపిన విషయం తెలిసిందే. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వారు నేరం చేసినట్లు అంగీకరించారు. దీంతో ఆదివారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిటన్లు సీఐ చెప్పారు.

బుద్ధుని కొండను పరిశీలిస్తున్న డీఎస్పీ



బుద్ధుని కొండను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ధ్వంస మైన బుద్ధుని విగ్రహాన్ని ఆదివారం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పరిశీలించారు. ధ్వంసానికి కారణాలను, ఆరా తీయా లని తాలుకా సీఐ కళా వెంకట రమణను ఆదేశించారు. దుండ గులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అశ్వవాహనంపై చెన్నకేశవ స్వామి



అశ్వవాహనంపై ఊరేగుతున్న చెన్నకేవశస్వామి

రాజంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాకలోని చెన్న కేశవ, సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అశ్వావాహనంపై చెన్నకేశవ స్వామి పురవీధుల్లో దర్శన మిచ్చారు. అదేవిధంగా పల్లకి సేవలో సిద్దేశ్వర స్వామి ఊరేగారు. మహిళలు స్వాము లవారికి కర్పూర హారతులు సమర్పించి పూజలు నిర్వహించారు.

అపరకాశి తాళ్లపాక



మాట్లాడుతున్న గంగనపల్లి వెంకటరమణ

రాజంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాక అపరకాశిలాంటిదని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ అన్నారు. చెన్నకేశవ, సిద్దేశ్వర వార్షిక బ్రహ్మోత్సవాల ముంగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాళ్లపాక స్థల పురాణం, అన్నమాచార్యుల జీవితం అనే అంశంపై ఆయన మాట్లాడారు. తాళ్లపాక అపరకాశిగా వాసికెక్కిందని పేర్కొంటూ అనేక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, దార్మికోపన్యాసకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విద్యాపీఠం ఉపాధ్యక్షుడిగా శంకర్



ఒంటిమిట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి విద్యాపీఠం కడప విభాగం ఉపాధ్యక్షుడిగా ఒంటిమిట్ట పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్‌ను నియమిస్తూ పీఠం కార్యదర్శులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ పీఠం ద్వారా 72 విద్యా సంస్థలు నడుస్తున్నాయని, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శంకర్ తెలిపారు. ఈ విద్యా సంస్థల్లో గుణాత్మక విద్య, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యా విధానం ఉంటుందన్నారు.

కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటిటౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 31 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, కలకడ, చక్రాయపేట, కదిరి, ఎన్‌పీకుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో 31 మందికి ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

సిద్దవటం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో శనివారం రాత్రి తోపులాట జరిగిన సంఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. మాధవరం-1, ఎస్‌కేఆర్ నగర్, ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి అధికంగా మద్యం సేవించి మద్యం మత్తులో ఇరువర్గాలకు చెందిన ఓబులేశు, జగదీష్, నాగేంద్ర, గోవిందు, సురేంద్ర, మణి అనే వ్యక్తులు మద్యం సేవించి మద్యం మత్తులో ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం తెలపడంతో వారు అదుపు చేశారు. ఇరువర్గాలకు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. జూలై 16, 17 తేదీల్లో జరిగే గంగమ్మ జాతరలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

ప్రయాణికులకు ఎంత కష్టం.. ఏమిటీ నిర్లక్ష్యం?

- చిట్వేలి ఆర్టీసీ బస్టాండులో కనీస వసతులు కరువు
- భరించలేని దుర్గంధం.. మందుబాబులకు నిలయం



అభివృద్ధికి నోచుకోని చిట్వేలి ఆర్టీసీ బస్టాండు (ఇన్‌సెట్) అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

చిట్వేలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చిట్వేలిలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కరువయ్యాయి. వసతుల కల్పనలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. ఆర్టీసీ అధికారులకు ఆదాయం పైనే ఆశ అన్నచందంగా ఉంది ఆర్టీసీ బస్టాండు దుస్థితి. ప్రతిరోజు మండలం నుంచి దూర ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. పేరుకే ఆర్టీసీ బస్టాండు అన్న చం దంగా ఉంది. పట్టుమని పది బస్సులు కూడా బస్టాండులో ఆగడంలేదు. ప్రజల కోసం నిర్మించిన ఆర్టీసీ బస్టాండులో పట్టుమని పది మంది కూడా ఇక్కడ నిలవకుండా ఉన్నారంటే ఆ బస్టాండ్ ఆవరణం ఎలా ఉందో అర్థమవుతుంది. తీవ్ర ఉక్కపోత, ఎండలతో ప్రయాణికులు సేద తీరాలని ఆర్టీసీ ప్రాంగణంలోకి అడుగు పెడితే దుర్గంధం, చెత్తా చెదారంతో ముక్కు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి మరీ దారుణం. అత్యవసర పరిస్థితుల్లో మరుగుదొడ్డికి వెళ్లాలంటే అపరిశుభ్రతతో బస్టాండు దర్శనమిస్తుంది. పైగా బస్టాండు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. మరీ మందుబాబులకు అడ్డాగా మారిందని, చీకటిపడితే మద్యం ప్రియులకు గెస్ట్‌హౌస్‌గా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండును అధికారులు గాలికి వదిలేశారనే విమర్శలున్నాయి. బస్టాండును పరిస్థితి ఇంతేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బస్సుల కొరతతో విద్యార్థుల అవస్థలు



సమయానికి బస్సులు నడపాలని విన్నవిస్తున్న విద్యార్థులు

చిట్వేలి మండలంలో బస్టాండుతో పాటు బస్సులు కొరత కూడా వేధిస్తోంది. మండలంలో ప్రతి రోజు వి ద్యార్థులు రాజంపేట, కోడూరుకు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు సమయానికి బస్సులు లేకపోవ డం వారు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు రాజంపేట డిపోలో ఫిర్యాదు చేసినట్లు విద్యార్థులు చెబుతున్నారు. అయినా సరైన సమయానికి బస్సులు అందడంలేదని, దీంతో కాలేజీలకు సమయానికి చేరుకోలేకున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరీ పరీక్షల సమయంలో చాలా ఇబ్బంది ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేసి విద్యార్థులకు బస్సు సౌకర్యాలతో పాటు ఆర్టీసీ ప్రాంగణంలో ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు, విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యం: మంత్రి



చెరువుముందరపల్లెలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు

రామాపురం, జూలై13(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పాలన చంద్రబాబునాయుడితోనే సాధ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువుముందరపల్లెలో గాలివీటి రాజారెడ్డి కుమారుడు రామచంద్రారెడ్డి కుమారుని తేజగౌతమ్‌రెడ్డి కేశఖండన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. వారు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. గ్రామంలో ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం

రాయచోటిటౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు స్వీకరించిన తక్షణమే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వంలో అలాంటి ఇబ్బందులకు అవకాశం లేకుండా ముఖ్యమంత్రి నారా చంద్రాబునాయుడు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు.

సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు చేరాలి

చిన్నమండెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు సామాన్య ప్రజలకు, నిరుపేదలకు చేరేలా చర్యలు చేపట్టాలని మంత్రి మండిపల్లి సూచించారు. ఆదివారం తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

బోనాల విందు స్థలాన్ని పరిశీలించిన మంత్రి

చిన్నమండెం మండలం పడమటికోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలో జరగనున్న విరూపాక్షమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఇచ్చే విందు కార్యక్రమం కోసం స్థలాన్ని పరిశీలించారు. తగు జాగ్రత్తలు చెప్పి వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు.

ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి

- ప్రజా సంఘాల నేతల డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత రామాంజనేయులు

రాయచోటిటౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): గౌతమబుద్ధుడి తల నరికిన ఉన్మాది దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి నిందితులపై దేశ ద్రోహం నమోదు చేయాలని రాయచోటిలో ప్రజా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు అధ్యక్షతన పలు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యదర్శి టీ. ఈశ్వర్, పౌరహక్కుల సంగం జిల్లా కార్యదర్శి రవిశంకర్, భారతీయ అంబేడ్కర్ సేన కేంద్ర కమిటీ సభ్యులు కేవీ రమణ, బహుజన సేన వ్యవస్థాపకుడు శ్రీచందులు, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లి గ్రామంలో ఉన్న గౌతమ బుద్ధుని విగ్రహన్ని ధ్వంసం చేసిన ఉన్మాద ఘటనకు కారకులైన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు వంగిమళ్ల రమణ, లాయర్ రెడ్డెయ్య, బాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎంవీ రమణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు పద్మావతి, బాస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి ముత్యాల మోహన్, బంజారా సంఘం జాతీయ నాయకులు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌస్‌బాషా, రజక సంఘం జిల్లా నాయకులు రమేశ్, శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు సు:ధీర్, విద్యార్థి నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోదండరాముని దర్శించుకున్న ఎమ్మెల్సీ

ఒంటిమిట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయాన్ని ఆదివారం ఎమ్మెల్సీ టీజీ జనార్దన్ సందర్శించారు. అర్చకుడు శ్రావణ్‌కుమార్ ఆయనకు ఆలయ మర్యాదలు చేశారు. రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, సీనియర్ నేత ఎస్వీ రమణ, ఎంపీపీ ప్రతినిధి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

రాజంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం రాజంపేట ఏఐటీయూసీ కార్యాలయంలో టైల్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ పాల్గొని మాట్లాడుతూ టైల్స్ వర్కర్‌లు, భవన నిర్మాణకార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు లేక వారు నష్టపోతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు గాలి చంద్ర, సికిందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

రాజంపేట టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా రాజంపేట మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ నాయకులు రమణ, గంగయ్య, రమేష్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగన్ పాలనలో ఆలయాలకు మహర్దశ'



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె, జూలై13(ఆంధ్రజ్యోతి): జగన్‌పాలనలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ బాలసుబ్రమణ్యం అన్నారు. సంబేపల్లె మండలం ప్రకాశ్‌నగర్ గ్రామం నగిరిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆవుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సెల్ వెంకట్రామిరెడ్డి, వాసుదేవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా తిరుమల శ్రీవాణి ట్రస్టు ద్వారా 76 ఆలయాలు మంజూరు అయ్యాయని తెలిపారు.

ప్రజలకు సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై కరపత్రం అందిస్తున్న జగన్‌మోహన్‌రాజు

నందలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేయడమే టీడీపీ లక్ష్యమని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని దుర్గాపురంలో ఇంటింటికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పాలన కోసం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. సీఎం చేపట్టే మరెన్నో సంక్షేమ పథకాలను ప్రతి పథకాలను ప్రజలకు వివరించామన్నారు. 2047కు ప్రపంచపటంలో అమరావతి మొదటి స్థానంలో నిలబడేందుకు ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, మణి, కట్టా సుబ్రమణ్యం, జ్యోతి శివ, గంధం గంగాధర్, రమేష్, గంగాధర్, గంగనపల్లి శ్రీను, బుర్రా సుబ్బరాయుడు, శివ, దినేష్, మణికంఠ, నరసింహులు, రెడ్డిశేఖర్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

వివాదం తలెత్తకుండా పోలీసు బందోబస్తు

సిద్దవటం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కడప నగరానికి లింగంపల్లె పెన్నానది నుంచి పంపింగ్ స్కీం ద్వారా వెళ్లే ప్రాంతంలో నీటి సమస్య తలెత్తకుండా ఎస్‌ఐ మహమ్మద్‌రఫి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కడప కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు 350 మంది తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆదివారం నుంచి సమ్మెలోకి వెళ్లడంతో సచివాలయ ఉద్యోగులను నియమించి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణస్వామి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తాగునీటి సరఫరాను అడ్డుకుంటున్నారనే సమాచారం రావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అసిస్టెంట్ ఏఈ అంజనీకుమార్, పోలీసులు రాఘవ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం'



మాట్లాడుతున్న నేషనల్ బయోడైవర్సిటీ కమిటీ సభ్యుడు శ్రీనివాసులరెడ్డి

రాయచోటిటౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యమని నేషనల్ బయోడైవర్సిటీ కమిటీ సభ్యుడు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన రాయచోటికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్సీ జకియాఖానంతో కలిసి పట్టణంలోని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్ నివాసంలో బీజేపీ ముఖ్య నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జకియాఖానమ్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను పూర్తిగా నిర్వహిస్తూ పార్టీ కృషి కోసం తనవంతు గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు అరమాటి శివగంగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బయ్యస్వామి, జయచంద్ర, బండి ఆనంద్, పులి నరేంద్రకుమార్, పిల్లస్వామినాయక్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, రాజంపేట పార్లమెంటరీ నలుమూలల నుంచి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులందరికీ పింఛన్ అందజేయాలి

రాయచోటిటౌన్, జూలై13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలో అర్హులైన దివ్యాంగులను అధికారులు గుర్తించి పింఛన్ అందజేయాలని దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పీలేరు నియోజకవర్గంలో కేవీపల్లి మండలం వడ్లకుంట గ్రామం చిప్పాలవాండ్లపల్లెకు చెందిన ఒక చెయ్యిలేని దివ్యాంగుడు ఆర్. రెడ్డెప్ప రాయచోటికి వచ్చిన సందర్భంగా బస్టాండులో వంగిమళ్ల రంగారెడ్డి దివ్యాంగుడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన రెడ్డెప్పకు మోచేతి వరకు చేయలేదన్నారు. అయితే ఇటువంటి అర్హత కలిగిన దివ్యాంగుడికి పింఛన్ రాలేదని, ప్రభుత్వం కానీ, అధికారులు కానీ ఇతని పింఛను ఇవ్వకపోవడం దారుణమన్నారు. దివ్యాంగుడైన రెడ్డెప్ప పరిస్థితిని విచారించి కూటమి ప్రభుత్వం ఇతనికి పింఛను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కానీ కొన్ని చోట్ల రెడ్డెప్పలాంటి నిజమైన దివ్యాంగులకు పింఛన్లు అందడలం లేదని అటువంటి వారిని అధికారులు గుర్తించి 6 వేలు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

పేదలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ధ్యేయం



నూతన సభ్యులను అభినందిస్తున్న లక్ష్మీనారాయణ

రాజంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :పేద, బడుగు బలహీన వర్గాలకు సేవ చేయడమే లయన్స్‌క్లబ్ ధ్యేయమని ఆ సంఘ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం రాజంపేటలో జరిగిన లయన్స్‌క్లబ్ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1978 నుంచి రాజంపేటలో లయన్స్‌క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాజంపేట, చిట్వేలి, నందలూరు, ఒంటిమిట్ట చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. సభ్యత్వం పొందిన అతికారి కృష్ణ, ఎల్.వెంకటసుబ్బయ్య(ఎల్వీ), సంభావు వినయ్‌కుమార్‌లకు లయన్స్ పిన్‌ను బహూకరించారు. డాక్టర్ పారా సుబ్బానాయుడు, డాక్టర్ చెన్నూరు సుధాకర్, కేఎస్ నరసింహా, బాలరాజు, గీతాంజలి రమణ, నవీన్ పాల్గొన్నారు.

పెద్దాయన ఆశయ సాధనే లక్ష్యం

- సంస్మరణ సభలో సుగవాసి ప్రసాద్‌బాబు



మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

సుండుపల్లె, జూలై 13(ఆంధ్ర జ్యోతి): పెద్దాయన ఆశయ సాధనే లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. పేదల పక్షపాతి స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు ఆశయ సాధన కోసం పనిచేస్తామన్నారు. ఆదివారం మండల కేంద్రానికి సమీపంలోని భైరవగుట్ట వద్ద పాలకొండ్రాయుడి సంస్మరణ సభను నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన సుగవాసి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ ఓటమికి కారణమైన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడతామన్నారు.తమ తండ్రికి అండగా నిలిచిన సుండుపల్లె మండల ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్ నాయుడు, టీడీపీ నాయకులు శివకుమార్ నాయుడు, యూనియన్ బాషా, శివారెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, శ్రీనివాసులరెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శివప్రసాద్‌నాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేణుకా యల్లమ్మకు పూజలు

సిద్దవటం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా యల్లమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. గణపతిపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఖాజీపేట మండలం అప్పన్నపల్లె గ్రామస్థులు శ్రీనివాసులు, రమేష్, శ్రీను, అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

కంకర..కరకరా..!

● కరిగిన మోరీలు ● కమ్మి తేలిన రోడ్లు ● ప్రయాణం నరకం ● అధ్వానంగా బోడిమలదిన్నె రహదారి


బోడిమలదిన్నె గ్రామంలో కంకర తేలి పైకిలేచిన కమ్మీలు

మదనపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కంకర తేలి.. కమ్మి కనిపిస్తూ.. కరిగిపోయిన మోరీలు.. మదనపల్లె నుంచి బోడిమలదిన్నె మీదుగా నిమ్మనపల్లె మండలానికి వెళ్లే లింకు రోడ్డు దుస్థితి ఇది. రోడ్లు, భవనాల శాఖకు చెందిన ఈ రోడ్డును 2013లో మట్టి నుంచి తారురోడ్డుగా మార్పు చేసింది. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి వికలాంగుల కాలనీ, ఇసుకనూతిపల్లె, కొండామరిపల్లె, బెస్తపల్లె, బోడిమలదిన్నె మీదుగా నిమ్మనపల్లె మండలం గారబురుజుకు వెళ్లే గ్రామీణ రోడ్డు ఇది. 6 కి.మీ. దూరం గల ఈ మార్గంలో అయిదు బ్రిడ్జిలు, కొండామరిపల్లె సమీపంలోని మంగళపల్లె చెరువుకు రైలింగ్ గోడ నిర్మించారు. మొత్తం తారు రోడ్డు అయినప్పటికీ కొండామరిపల్లె, బెస్తపల్లె, బోడిమలదిన్నె గ్రామాల్లో సిమెంటు రోడ్డు వేశారు. పైప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు ప్రవహించే, చెరువు మొరవలు ఉండే ప్రాంతాల్లో సిమెంటు కాంక్రీటు నిర్మాణంతో రోడ్డు వేశారు. తర్వాత అయిదు కి.మి.మేర తారురోడ్డు వేశారు. అంతవరకు బాగానే ఉన్నా..ఈ రోడ్లు వేసిన రెండేళ్లకే కంకర తేలిపోయి, గ్రామంలో సిమెంటు కాంక్రీటులో వేసిన కమ్మీలు బయట కనపడుతున్నాయి. అలాగే రోడ్డు వెంట నిర్మించిన బ్రిడ్జి (మోరీ)లకు అటు, ఇటు నిర్మించిన రైలింగ్ గోడలు కూడా కరిగిపోయాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రెండేళ్లకే ఈ దారుణ పరిస్థితికి వచ్చాయి.

అయితే తారురోడ్డు కూడా అక్కడక్కడా కంకర తేలి గుంతలు పడగా, తర్వాత గతుకులకు అతుకులు వేశారు. కానీ సిమెంట్ రోడ్డును మాత్రం అలాగే వదిలేశారు. పది గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. కంకర లేచిన రోడ్డులో ప్రయాణం అంటేనే భయపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కంకర రాళ్లతో నిత్యం వాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాహనాల ప్రయాణం పక్కన పెడితే, నిత్యం ఇళ్ల నుంచి బయటకు వచ్చి తిరగడమే గగనంగా మారింది. ఈ రోడ్లను బాగు చేయాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నా..ప్రయోజనం లేదు. గ్రామాలకు వచ్చిన పాలకులు, అధికారులను నిత్యం నిలదీస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదీ జరిగినా.. అక్కడికి వచ్చే రాజకీయ నాయకులు, పాలకులకు కంకర తేలిన రోడ్ల సెగే వారిని భయపెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..స్థానికుల్లో కాస్త ధైర్యం వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రోడ్లకు డిప్యూటీ సీఎం, పంచాయతీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ పెద్దపీట వేస్తుండటంతో మదనపల్లె-బోడిమలదిన్నె రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


బెస్తపల్లెక్రాస్‌లో సిమెంటు రోడ్డు దుస్థితి


కొండామరిపల్లెలో కంకర తేలిన రోడ్డు


కొండామరిపల్లె సమీపంలో కరిగిపోయిన బ్రిడ్జి రైలింగ్ గోడ

ఉత్సవ విగ్రహాలుగా ఉన్నత విద్యాలయాలు

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి


మాట్లాడుతున్న తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిధులు, సిబ్బంది కొరత కారణంగా రాష్ట్రంలో ఉన్నత విద్య నిర్వీర్యమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాలు ఉండగా 9 విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లు లేరన్నారు. 474 ప్రొఫెసర్ పోస్టులు, 859 అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులు, 2,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు క్షీణించాయన్నారు. రూ. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు, మెస్ చార్జీల బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాయన్నారు. 2020 డిసెంబరు 25న వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 77 కారణంగా ప్రైవేట్, ఎయిడెడ్ పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు వర్తించక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్నారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమే కాలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ సమన్వ యకర్త ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, నాగరాజు, వేమ య్య, బద్రి, మాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు మూడు ఎకరాలు విరాళం


భూమి పత్రాలను ట్రస్ట్ సభ్యులకు అందిస్తున్న దాతలు

తంబళ్లపల్లె జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లయ్యకొండ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సేవా సమితి అన్నదాన ట్రస్ట్‌కు తంబళ్లపల్లె మండల కేంద్రం సాలెవీధి వాసి గనుముక్కల శ్రీనివాసులు తమ తల్లిదండ్రులు మునెమ్మ, సుబ్బరాయుడు జ్ఞాపకార్థం అన్నదాన కేంద్రానికి సమీపంలోని మూడెకరాల భూమిని ట్రస్ట్ అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ఆదివారం శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి భూమి పత్రాలను ట్రస్ట్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీం, అన్నదాన ట్రస్ట్ సభ్యులు నారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ్మూర్తి, జయనారాయణరెడ్డి, రఘు,తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి కేసులో భర్త అరెస్టు ..

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి) :భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను ఆదివారం అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పదేళ్ల క్రితం మదనపల్లె మండలం, తురకపల్లెకు చెందిన శశికళను కలికిరి మండలం, నాయనిచెరువుపల్లెకు చెందిన రెడ్డిప్రకాష్ వివాహం చేసుకున్నాడు, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పది రోజుల క్రితం భర్తతో గొడవపడి శశికళ విడిగా ఉంటోంది. శనివారం శశికళ తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తురకపల్లెకు వెళుతోందని తెలుసుకున్న రెడ్డిప్రకాష్ అక్కడికి వెళ్లి కత్తి దాడి చేయగా బంధువులు అడ్డుకున్నారు. దీంతో అతను పర్యాయాడు. ఆమె వెంటనే 112కు సమాచారం అందించింది. కాగా, పట్టణంలోని మద్యం దుకాణం వద్ద నిందితుడు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రెడ్డిప్రకాష్‌పై పలు కేసులు ఉన్నాయని, తాను అతనికి దూరంగా ఉంటున్నాని, విడాకులకు కూడా దరఖాస్తు చేసినట్లు చెబుతోంది.

ఇద్దరిపై దాడి కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి):ఇంటి విషయంలో దాడి చేసి గాయపర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, కోటావూరికి చెందిన శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తన అక్క ఇంటి ముందు నిద్రిస్తుండగా అతని అన్న కుమారుడు సురేంద్ర కట్టెతో దాడి చేసి గాయపర్చారు. విషయం గమనించిన చంద్రమ్మ, ఆమె కుటుంబసభ్యులు అడ్డు వెళ్లగా వారిపై కూడా దాడి చేశాడు. ఈ విషయంపై చంద్రమ్మ తన అన్న వెంకటరమణ ఇంటికి వెళ్లి ప్రశ్నించగా అక్కడే ఉన్న అతని చిన్నకుమారుడు రాజేంద్ర ఆమె మెడపట్టి బయటకు నెట్టేశాడు. శ్రీనివాసులు ఉంటున్న ఇంట్లో తనకు భాగం ఉందని అడిగినందుకే దాడి చేసినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సురేంద్ర, రాజేంద్రలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


ఓబులేసు మృతదేహం

పెండ్లిమర్రి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చక్రాయపేట మండలం నడింపల్లెకు చెందిన ఇండ్లోల ఓబులేసు (23) నందిమండలం గ్రామస్తుడు జాకీర్‌కు చెందిన పొలానికి కాపలాదారుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి నీలం వెంకట శివ అనే వ్యక్తి తన పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అయితే, అతని మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పోలీసులు తెలిపారు.

వన మూలిక తిని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విషపూరితమైన వన మూలిక, బెల్లం తిని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీటీఎం, పడమటి వీధికి చెందిన రాజయ్య(62) కూలి పనులు చేస్తూ జీవించేవాడు. రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతుం డడంతో శనివారం రాత్రి భార్య రాజమ్మ ఆయనను మందలించిం ది. దీంతో ఆదివారం ఉదయం ఎవరూ లేని సమయంలో వన మూలిక బెల్లం కలుపుకుని తిని ఇంట్లో స్పృహతప్పి పడిపోయాడు. మధ్యాహ్నం కూలి పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన భార్య విషయం గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా


బోల్తాపడిన సిమెంటు ట్యాంకరు

వల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కడప - తాడిపత్రి మండల పరిధిలోని ఎ.ఓబాయపల్లె సమీ పంలో ఆదివారం సాయంత్రం లారీ బోలా పడిందని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఆయన అందించిన సమా చారం మేరకు ఎర్రగుంట్ల నుంచి సిమెంటు లోడుతో వెళుతున్న ట్యాంకరు డ్రైవరు మద్యం మత్తులో వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. కాకపోతే రోడ్డు మధ్యలో పడడం వల్ల కొంత మేర ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి క్రేన్ సాయంతో ట్యాంకరును తొలగించి యథావిధిగా ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పులివెందుల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న ఓ మహిళ ఆదివారం మృతి చెందింది. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన సరితాల రహమత్ (24) జూలై 7 న కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఒభర్త అల్లాబాష కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి కర్నూలుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు.

గంటలోపే తప్పిపోయిన పిల్లల ఆచూకీ గుర్తింపు

● తల్లిదండ్రులకు అప్పగించిన చిన్నచౌకు పోలీసులు


పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న చిన్నచౌకు సీఐ, ఎస్ఐలు

కడప క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన ఇద్దరు చిన్నారులను గంట సమయంలోపే గుర్తించిన చిన్నచౌకు పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్ కుటుంబం జీవనోపాధి నిమిత్తం ఇటీవల కడప నగరానికి వలస వచ్చి అశోక్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారు తమ పిల్లలు అశోక్(8), శారద (12)ను స్థానిక పాఠశాలలో చేర్పించేందుకు తమ గ్రామం నుంచి కడపకు తీసుకువచ్చారు. అయితే, అది ఇష్టం లేని చిన్నారులు తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో కనిపించకుండాపోయారు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఓబులేసు ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, ఎస్.రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. కేవలం ఒక గంటలోపే ఇద్దరు పిల్లల ఆచూకీ కనుగొని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసుల కృషిని స్థానికులు కొనియాడారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

● ఘనంగా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం


నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ రమేష్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జిల్లాల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు అనంతబొట్ల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రమేష్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో కడప అన్నమయ్య క్లబ్‌కు ఉమ్మడి జిల్లాలోనే మంచి గుర్తింపు వచ్చిందన్నారు. పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సేవా భావం అలవర్చాలన్నారు. కీలక సందేశం ఇచ్చిన పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జె.రామచంద్ర ప్రకాష్‌రావు మాట్లాడుతూ 50 ఏళ్లుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ కె.చిన్నపరెడ్డి దిశ నిర్దేశం చేస్తూ సభ్యు లందరికి సహకారంతో సమాజ సేవలో ప్రతి ఒక్కరిని భాగస్వాము లను చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ అవసరార్థులను ఆదుకోవ డమే కాక, డ్రగ్స్ తదితర సామాజిక రుగ్మతల నుంచి యువతను విముక్తి చేయడం, పర్యావరణ పరిరక్షణలాంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆదూర శివశంకర్‌రెడ్డి, ఎస్ఎండీ బాషా, టీఎస్ గౌరీశంకర్, కార్యదర్శిగా గునిశెట్టి సాయికుమార్, జాయింట్ సెక్రటరీగా రాఘవేంద్ర వర్మ, కోశాధికారిగా సుబఖ్ తాహిన్, సహ కోశాధికారిగా కొండూరు జనార్దన్ రాజు బాధ్యతలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసులు, బోగాల కొండారెడ్డి, వి.గౌరీశంకర్, దేవతి రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మ రథోత్సవం


రథంపై ఊరేగుతున్న యల్లమ్మ అమ్మవారు

కలికిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యల్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథంపై అమ్మవారిని కొలువు దీర్చారు. గృహస్తులు రథాన్ని స్వాగతించారు. అడుగడుగునా భక్తులు సాగిలపడ్డారు. అమ్మవారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు.

పంచాయతీ కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, వెంకట రెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు రథోత్సవాన్ని పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించేందుకు మహిళలు బారులు తీరారు. గ్రామాల నుంచి గుంపులు గుంపులుగా బ్యాండు వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చిన మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి చాందినీ బండ్లు ప్రదక్షిణలు చేశాయి.

ఏసీఏ అండర్-16 క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు ఆధిక్యం


ఎం.డి.ఎస్. అక్తర్ (202 పరుగులు)


తేజేశ్ (5 వికెట్లు)


దైవిక్ (58 పరుగులు)

కడప స్పోర్ట్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ పోటీల్లో భాగంగా రెండు వేర్వేరు జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లలో చిత్తూరు జట్టు 160 పరుగుల ఆధిక్యం సాధించగా, మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 96 పరుగుల వెనుకంజలో నిలిచింది. వివరాలిలా...

కేఓఆర్ఎం మైదానంలో

నగర శివారులోని కేఓఆర్ఎం మైదానంలో చిత్తూరు- కడప జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 38.4 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్ అయింది. కాగా చిత్తూరు జట్టు బౌలర్ తేజేశ్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. ఇందులో ఎండీఎస్. అక్తర్ ఏకంగా 202 పరుగులు చేయడం విశేషం. దీంతో చిత్తూరు జట్టు ఇప్పటికే 160 పరుగుల ఆధిక్యం సాధించింది.

ఏసీఏ మైదానంలో

వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానంలో టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు 74 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌట్ అయింది. దైవిక్ 58 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరు గులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 96 పరుగుల వెనుకంజలో ఉంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు , జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి విషయంలో ఏర్పడిన వివాదంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. రామేశ్వరం మిట్టమడి 9వ వీధిలో ఉండే రెండు సెంట్ల ఇంటి విషయంపై ఎద్దుల ప్రమీలా దేవికి అమరావతి వేణుగోపాల్ మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో 11వ తేదీ మధ్యాహ్నం ప్రమీలా దేవితో ఇల్లు ఖాళీ చేయించేందుకు వేణుగోపాల్ సింహాద్రి పురానికి చెందిన జాకీర్, ఇదయతుల్లాను పురమాయించాడు. వారు ఆమె ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేయడంతోపాటు, సామాను చెల్లాచెదురు చేసి బెదిరించారని బాధితు రాలి భర్త మల్లికార్జున తెలిపాడు. 12 తేదీన మున్సిపల్ పార్కు వద్ద ఉన్న మల్లికార్జునను వెంబడించే ప్రయత్నం చేశారని అతను భార్య ప్రమీలా దేవికి ఫోన్‌లో తెలపడంతో ఆమె ఆందోళనకు గురై ఆత్మ హత్యాయత్నం చేసింది. ఈ విషయంపై వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): భర్తను హత్య చేసిన కేసులో భార్య వనిత, ప్రియుడు రెడ్డిరామ్‌ను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, బసినికొండ నక్కలకుంటలో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్న గంగాధర్‌ను జూన్ 15 రాత్రి ఆదివారం ఇంట్లోనే నరికి చంపిన విషయం తెలిసిందే. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వారు నేరం చేసినట్లు అంగీకరించారు. దీంతో ఆదివారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

బుద్ధుని కొండను పరిశీలిస్తున్న డీఎస్పీ


బుద్ధుని కొండను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ధ్వంస మైన బుద్ధుని విగ్రహాన్ని ఆదివారం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పరిశీలించారు. ధ్వంసానికి కారణాలను, ఆరా తీయా లని తాలుకా సీఐ కళా వెంకట రమణను ఆదేశించారు. దుండ గులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వైభవంగా బోయకొండ గంగమ్మకు అభిషేకాలు



వాల్మీకిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక తోటవీధి ప్రాంతంలో వెలసిన బోయకొండ గంగమ్మ దేవత ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి మాసం రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో బోయకొండ గంగమ్మకు అభిషేకాలు, విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు గావించి భక్తులకు తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బోయకొండ గంగమ్మ, ఎల్లమ్మ తల్లి జాతర్లు



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

నిమ్మనపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొడయ్యగారి పల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లిలో ఆదివారం బోయకొండ గంగమ్మ, ఎల్లమ్మతల్లి జాతర్లను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేత సుధాకర్‌రావు కొత్తగా ఏర్పాటు చేసిన బోయకొండ గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను వేద పండితులచే పూజలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులు ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హహిళలు బోనాలు మోశారు. బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే శోభమ్మ భర్త బాబురెడ్డి, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గాంగారపు రాందాస్ చౌదరి, పలువులు టీడీపీ నేతలు హాజరయ్యారు.

రమాదేవికి శాకంబరీ అలంకరణ

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): చిట్టి అన్నవరం సత్యనారాయణ దేవాలయంలో ఆదివారం రమాదేవికి శాకంబరీ అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. లక్ష్మీగాయిత్రి మహిళా మండలి సభ్యులు లలితా సహస్రనామ స్తోత్రం, విష్ణు సహస్ర స్తోత్రం పారాయణం చేశారు. అనంతరం అమ్మకు సారెతో కూడిన వడిబియ్యం అందజేశారు. ఆలయ కమిటీ అమరనాధ్, రామకృష్ణ, చంద్రశేఖర్, దివాకర్, భాస్కర్‌రావు, ఆదినారాయణ, వైద్యం లలిత, సుచిత్ర, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విరూపాక్షమ్మ జాతర



అమ్మవారి ఊరేగింపు

కలకడ, జూలై 13(ఆంధ్రజ్యోతి): గంగాపురంలో కొలువైన విరూపాక్షమ్మ అమ్మవారి జాతరను గ్రామస్థులు వైభవంగా చేసుకున్నారు. ఇందులో భాగంగా చాందినీ బండ్లను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి నుంచి ఆది వారం వేకువజాము వరకు దేవతా మూర్తుల వేషధారణలో కళాకారుల నృత్యాలు, కోలాటాలు, బళ్లారి డ్రమ్స్, బాణసంచా పేల్చుతూ అమ్మవారిని పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమీప గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కోళ్ల పెంపకంతో అధిక లాభాలు



పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షిరీన్ లారెన్స్

మదనపల్లె టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎన్విరాన్‌మెంటల్లీ కంట్రోల్డ్ (ఈసీ)షెడ్లతో కోళ్ల పెంపకంలో అధిక లాభాలు పొందవచ్చని మండల పశుసంవర్థకశాఖ అధికారి షరీన్ లారెన్స్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కోళ్ల ఫారాలు ఏర్పాటు, రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. మాట్లాడుతూ వాతావరణంలోని మార్పులకు అనుగుణంగా ఈసీ షెడ్లు వాటంతటవే స్వభావాన్ని మార్చుకునేలా రూపొందించుకోవచ్చన్నారు. దీని వలన తక్కువ ఖర్చుతో పౌల్ట్రీ రైతులు అధిక లాభాలు గడించవచ్చన్నారు. కోళ్ల ఆరోగ్యం బాగుంటుందని, వనరులను వినియోగించుకోవచ్చన్నారు. పౌల్ట్రీ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే రాయితీలను పునరుద్ధరించాలి

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేరాయితీలు పునరుద్ధరించాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక జీఆర్టీ స్కూల్‌లో ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, గౌరవాధ్యక్షుడు మునిరత్నమయ్య, కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్ మాట్లాడుతూ ఈ విషయం పోస్టు కార్డుల ద్వారా దేశప్రధానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగరాజ, కృష్ణమూర్తి, టీఎస్‌ఏ కృష్ణమూర్తి, ధనలక్ష్మీ, ప్రసన్న లక్ష్మీ, జయమ్మ, రాధికాబాయ్, అబ్దుల్ ఖాదర్, పెన్షనర్స్ పార్టీ నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాటి నేతల నిబద్ధత చిరస్మరణీయం

నల్లారి అమరనాథరెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



అమరనాథ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యాభైఏళ్ల కిందటి రాజకీయాలకు, నేటి రాజకీయ పోకడలకు ఎంతో వ్యత్యాసముందని, అప్పటి నేతల నిబద్ధత చిరస్మరణీయమని, అందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అన్నారు. తండ్రి, దివంగత మంత్రి నల్లారి అమరనాథ రెడ్డి వర్ధంతి సందర్భంగా అమరనాథ రెడ్డి సమాధిని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, ఏఎంసీ అధ్యక్షులు మాలతి, ఉపాధ్యక్షుడు సనావుల్లా, డైరెక్టర్లు, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జనం మెచ్చిన నేత నల్లారి అమరనాథరెడ్డి

వాల్మీకిపురం/గుర్రంకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): జనం మెచ్చిన నేత దివంగత మంత్రి నల్లారి అమరనాథరెడ్డి అని వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. వాల్మీకిపురంలో నల్లారి అమరనాథరెడ్డి వర్ధంతిని చేశారు. యార్డు వద్ద అమరనాథ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, మండల బీజేపీ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. గుర్రంకొండలో నల్లారి అమరనాథ్ రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. యార్డు వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. నేతలు జగదీష్, మూర్తిరావు, జయసూరి, నాగేంద్ర, ఆనంద్, నారాయణ, చంద్రబాబు, చిన్నప్ప, సుధాకర్, శ్రీనివాసులు, బాబాజాన్, బయ్యారెడ్డి, సుదర్శన్, ద్వారక, హుస్సేన్, వెంకటరమణ, నరసింహులు, తస్వీర్, వాసు, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్వహణాలోపం - పెను ప్రమాదం



బూర్లపల్లెలో ఆరుబయటే పడేసిన చెత్త

డంపింగ్ యార్డులకు చేరని చెత్త ● చెత్త నుంచి సంపద ఎక్కడ ?

● ఆరుబయటే చెత్తా చెదారంతో ప్రజలకు తప్పదు ముప్పు

పెద్దతిప్పసముద్రం జూలై 13 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డుల్లో నిర్వహణాలోపం కారణంగా పర్యావరణానికి ప్రమాదం తప్పడంలేదు. 2018లో చెత్తనుంచి సంపద కేంద్రాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్మించినా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని గాలికొదిలేసింది. దీంతో ఆయా గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ఆరుబయటే చెత్తాచెదారం వేస్తుండడంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేయడం, వాటిని డంపింగ్ యార్డుల్లో నిర్మించిన తొట్టెల్లో వేసి సహజ ఎరువుగా మార్చడం వంటి లక్ష్యాలతో నిర్మించినా నిరుపయోగంగా మారడంతో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీంతో ఆ చెత్త వాగులు, చెరువులు, పంటపొలాల్లోకి కొట్టుకు పోతుండడంతో పర్యావరణం కాలుష్యం భారినపడుతోంది. ఫలితంగా గ్రామాల్లో దోమలు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయి. ఓ వైపు చెత్త సంపద కేంద్రాలను బృందావనాలుగా తీర్చిదిద్దాలని టీడీపీ ప్రభుత్వం చెబుతున్నా నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరడం లేదు. మండలంలో ఉన్న 20 సచివాలయాల్లో ఒక్కటి రెండు గ్రామాల్లో తప్ప ఎక్కడా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చడం లేదు. యార్డుల నిర్వహణ లోపం, నిధులు లభ్యం కాకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ప్రజాగళాలు వినిపిస్తున్నాయి. పరిష్కారం కోసం, పంచాయతీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అవగాహన కల్పించాలి.

చెత్తను ఆరుబయటే వేస్తున్నారు

డంపింగ్ యార్డుల్లోనే చెత్తను వేయాలని, చెత్త నుంచి సంపదను సృష్టించాలని, చెత్త సంపద కేంద్రాలను బృందావనాలుగా తీర్చి దిద్దాలని అధికారులు చెబుతున్నా సిబ్బంది కొరత కారణంగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో విఫలమవుతున్నారు. ఓ వైపు సిబ్బంది కొరత, మరో వైపు కార్మికులకు జీతభత్యాలు రాకపోవడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. డంపింగ్ యార్డులు నిజంగా ఉపయోగంలోకి తీసుకురావాలంటే ప్రజలను భాగస్వాములను చేయాలి. చెత్తను ఆరుబయట వేయకుండా డంపింగ్ యార్డుల్లోనే వేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలి.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

టి.సదుం, కమ్మ చెరువు, బూర్లపల్లె, పట్టెంవాండ్లపల్లె, కాట్నగల్లు, మద్దయ్యగారిపల్లె, మడుమూరు, రాపూరివాండ్లపల్లె తదితర గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డుల్లో వేయకుండా ఆరుబయటే వేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉదయం 6 గంటలకే చెత్తను సేకరించాలని అధికారులు చెబుతున్నా ఏ పంచాయతీ కార్యదర్శి కూడా ఆయా గ్రామాల్లో చెత్తను సేకరించే పని చేయడం లేదు. అధికారులు పర్యవేక్షిస్తే ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయవచ్చని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

అర్ధంతరంగా నిలిచిన యార్డు

మల్లెల గ్రామంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చెత్తసంపద కేంద్రాన్ని కొందరు గుత్తేదారులు పనిని ప్రారంభించి పిల్లర్ల వరకు నిర్మించారు. ఇంతలో ఆయన మృతి చెందడంతో ఆ పని అక్కడే నిలిచి పోయింది. అటు తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం పనులను ప్రారంభిస్తామని డంపింగ్ యార్డు నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పినా అది ఇప్పటికీ మొండిగోడలతో దర్శనమిస్తోంది. కనీసం ఇప్పటి ప్రభుత్వమైనా నిలిచి పోయిన డంపింగ్ యార్డు పూర్తి చేస్తారని ఎదురు చూస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా డంపింగ్ యార్డు నిర్మాణాన్ని పూర్తి సేకరించిన చెత్తను యార్డులకు తరలించి పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా బూర్లపల్లె డంపింగ్ యార్డు



నిరుపయోగంగా టి.సదుం యార్డు



ఖాళీగా కమ్మచెరువు డంపింగ్ యార్డులో చెత్త తొట్టెలు



మల్లెలలో ఆగిన డంపింగ్ యార్డు

గండికోటతో నీటి సమస్యకు పరిష్కారం

గుర్రంకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): గండికోట జలాలతో పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలకు శాశ్వతంగా తాగు నీటి సమస్య తీరనుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో ఆదివారం 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో ఆయన మాట్లాడుతూ పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గం ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడానికి గండికోట జలాలను అందించేందుకు టీడీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కేటాయించిందన్నారు. రెండు నియోజకవర్గాల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నౌషాద్‌అలీ, నేతలు జగదీష్, నౌషాద్ అహ్మద్, హరిప్రసాద్ నాయడు, చంద్రబాబు, మూర్తిరావు, చలమారెడ్డి, మురళీ, ఎజాజ్ అహ్మద్, నక్కా సతీష్, ఇక్బాల్ ఖాసీం, మౌలా, క్రాంతి, మహాత్మారెడ్డి, ఆనంద్, శేఖర్, బయ్యారెడ్డి, మేకల చలపతి, రామచంద్ర పాల్గొన్నారు.



ఇంటివద్దే చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాసంక్షేమమే ధ్యేయం

మదనపల్లె టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన అందిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. 'సుపరిపాలన-తొలిఅడుగు'లో భాగంగా 10వ వార్డులో ఎమ్మెల్యే ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇచ్చిన ఏడాది పాలనలోనే 70 శాతం హామీలను నెరవేర్చిన సీఎం చంద్రబాబు, అమరావతి, పోలవరం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. 25 మందికి ఇంటివద్దనే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు బాలుస్వామి, ఆర్‌కే రామకృష్ణాచారి, నాగార్జున గాంధి, కత్తి లక్ష్మన్న, చుక్కా విజయ్‌కుమార్, తాళ్ల హిమగిరి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ కళాశాలలో నామమాత్రం అభివృద్ధి

మదనపల్లె టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మదనపల్లె బీటీ కళాశాలలో ఏమి అభివృద్ధి చేసి చూపించారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్ ప్రశ్నించారు. స్థానిక టీఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేశామని, యూనివర్శిటీ చేసేశామని గొప్పలు చెప్పుకున్న ఎంపీ మిధున్‌రెడ్డి వాస్తవంగా నిబంధనల ప్రకారం ప్రభుత్వ పరం చేయలేదన్నారు. రాష్ట్రంలో నాలుగు కళాశాలను ప్రభుత్వ పరం చేసుకుంటే బీటీ కళాశాలను మాత్రం అనెగ్జర్-1 ప్రకారం చేయలేదన్నారు. డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలన్నింటిని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు ఉత్తన్న, ప్రసన్నకుమార్, అఖిల్, ఆనందరెడ్డి, శేఖర్, నాని తదితరులు పాల్గొన్నారు.

దారి కోసం గ్రామస్తుల ఆందోళన



కాంట్రాక్టు సంస్థ ప్రతినిధితో మాట్లాడుతున్న గ్రామస్తులు

పీలేరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 71 నుంచి తమ పొలాలు, ఇళ్లు, ఇంటి స్థలాలకు దారి కల్పించాలని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మేకలవానికాల్వ గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గ్రామానికి సమీపంలోని తమ పంట పొలాలు, ఇళ్లు, ఇంటి స్థలాలకు వెళ్లేందుకు దారి లేకుండా రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న అధికారులు తమకు దారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత అధికారులు దానిని పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు రక్షణ గోడ నిర్మించకూడదంటూ వారు భీష్మించుకు కూర్చోవడంతో కాంట్రాక్టు సంస్థ ప్రతినిధి కిశోర్ గ్రామస్తులతో మాట్లాడారు. నిబంధనల మేరకే రక్షణ గోడ నిర్మిస్తున్నామని, దారి సౌకర్యం కావాలంటే ఉన్నతాధికారుల అనుమతి పొందాలన్నారు. అయితే అనుమతి వచ్చే వరకు పనులు ఆపాలని గ్రామస్తులు కోరడంతో ఆయన అంగీకరించగా గ్రామస్తులు తమ ఆందోళన విరమించారు. రెవెన్యూ అధికారులు జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

గురువులను మరువలేం

కలకడ, జూలై 13(ఆంధ్రజ్యోతి): గురువులను మరువలేమని 1996-97 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు అన్నారు. ఆదివారం పాపిరెడ్డిగారిపల్లి ఉన్నత పాఠశాలలో కలిసిన వారు ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి చేష్టలు గుర్తుచేసుకుని మురిసిపోయారు. నాటి ఉపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి, నాగభూషణం, భారతిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలకు రూ. 21 వేల విలువైన నాలుగు టేబుళ్లలను బహూకరించారు. మరో లక్ష రూపాయలు యివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సయ్యద్‌బాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి



జగదీశ్వరి దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు, ప్రజలు

పెద్దమండ్యం, జూలై 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పిలుపు నిచ్చారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో డైరెక్టర్ పదవికి ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టిన తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న తరవాత విజయ్‌నాయక్ దంపతులు స్వగ్రామానికి విచ్చేయడంతో వారికి టీడీపీ నేతలు, మండల ప్రజలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బండకిందతండాలో ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, టీడీపీ నేతలు, ప్రజలు సన్మానించారు. ఎస్టీసెల్ నేత, అవికేనాయక్ తండా సర్పంచ్ నటరాజ్‌నాయక్, ఉపాధ్యక్షుడు నారా శ్రీనివాసులు టీడీపీ నేతలు బిక్కా మధుకర, మైసూరి శ్రీనివాసులు, జి. రమేష్, బోడెం భాను, తిమ్మయ్య, సయ్యద్‌బాష, ప్రతీప్, మస్తాన్, రెడ్డిబాష, ఓబులేసు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



మహల్ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కలికిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహల్ తెలుగు ఉన్నత పాఠశాలలో 1989-90 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయంగా కలిశారు. అప్పటి విద్యార్థులు దాదాపు 60 మంది బాల్య స్నేహాల్లోని విశేషాలను స్మరించుకున్నారు. పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. బెంగుళూరు రవిచంద్ర, శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వర్లు, షకీల్, అనిల్‌కుమార్ రెడ్డి, నారాయణస్వామి, వేణుగోపాల్ స్వామి పాల్గొన్నారు.

ఎస్టీ సాధనకు వాల్మీకులు ఏకం కావాలి

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా వాల్మీకులు ఏకమై ఎస్టీ సాధనకు నడుం బిగించాలని వాల్మీకి ధర్మసమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు పిలుపు నిచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకులు, బోయలు ఒక్కతా టిపైకి వచ్చి ఈ కులాలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణకు పోరాడాలన్నారు. అనంతరం వాల్మీకి ధర్మసమాజ్ నేతలు విజయ్‌మోహన్, పూలకుంట్ల హరిబాబును సన్మానించారు. వాల్మీకి రిజర్వేన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, గంగప్పల గంగరాజు, సుదర్శన్‌బాబు, వెంకటేష్, వాల్మీకి నేతలు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావుకు ఘన నివాళి

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే, సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు నివాళులర్పించారు. మదనపల్లె బీజేపీ నేతలు బండి ఆనంద్, వరదారెడ్డి నారథరెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘంగా పార్టీ కోసం పాటుపడి కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యే వరకు ఎదిగారన్నారు. సినీ ప్రరిశ్రమలో నటుడుగా చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు. బొజ్జప్ప, పులి నరేంద్రకుమార్‌రెడ్డి, నారథరెడ్డి, పిల్లస్వామినాయక్, వెంకట్‌రాజు, భగవాన్ పాల్గొన్నారు.

రేపు మల్లయ్యకొండ ఆలయ హుండీ లెక్కింపు

తంబళ్లపల్లె, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయంలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల లెక్కింపు 15న మంగళవారం చేపట్టనున్నట్లు ఈఓ మునిరాజ ఒక ప్రకటనలో తెలిపారు. కొండ పైన ఆలయంలో దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ఉదయం 11గంటల నుంచి కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నేతలు, భక్తులు, స్థానికులు పాల్గొనాలని ఈఓ కోరారు.

నేడు తంబళ్లపల్లెలో మంత్రి పర్యటన

ములకలచెరువు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు మండలాల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటిస్తారని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. ములకలచెరువులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ముదివేడు క్రాస్‌లోని తూర్పు హరిజనవాడలో సుపరిపాలనలో ముందగుడు, తర్వాత ముదివేడు క్రాస్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ, 11 గంటలకు దాదంవారిపల్లెలో సుపరిపాలన, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, 11.25కు సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, 11.50కు అంగళ్ళులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 12.15కు బి.కొత్తకోట మండలం తుమ్మణంగుట్టలో పీఎంజీఎస్‌వై కింద నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవం, 12.40కు ములకలచెరువు మండలం బురకాయలకోట సమీపంలోని టోల్‌గేట్ వద్ద అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ, 1 గంటకు వేపూరికోటలో సుపరిపాలనలో పాల్గొంటారన్నారు. ములకలచెరువులో మధ్యాహ్నం భోజనం చేసి తిరుమలకు బయలు దేరుతారన్నారు. మంత్రి కార్యక్రమాలకు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలందరూ తప్పక హాజరవాలని పిలుపు నిచ్చారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా

ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఏపీ పీటీడీ మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి పేర్కొన్నారు. స్థానిక ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు న్యాయ పరమైన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఈయూ రిజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాధిక్ అలీ, వన్‌డిపో అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి ఈశ్వరప్ప, టూ డిపో అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్‌కె హుసేన్, గ్యారేజ్ సెక్రటరీ రాజశేఖర్, హుసేన్, బీసీఎస్ నాయక్, సురేష్, ఎన్ కుమార్ పాల్గొన్నారు.

నేడు 'పీ4'పై సమావేశం

● హాజరు కానున్న ఎమ్మెల్యే

కలికిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పీ4' అమల్లో భాగంగా కార్యాచరణ రూపొందించడానికి నియోజకవర్గ స్థాయి సమావేశం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ భానుమూర్తి రావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులతో సమన్వయపరచడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. 'పీ4' సర్వేలో గుర్తించిన పేదల అవసరాలకనుగుణంగా మార్గదర్శులతో జతపరుస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ పాల్గొంటారని వివరించారు. కలికిరి, పీలేరు, కేవీ పల్లె, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల్లోని అందరు ప్రజా ప్రతినిధులు, అన్ని సచివాలయాల సిబ్బంది, విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక హేమాచారి కళ్యాణ మండపంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.